
మాట్లాడుతున్న టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్

ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే

నల్లకుంట: లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందని జోస్యం చెప్పారు. టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. నల్లకుంటలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇతర ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్ భారీ మెజారీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు శ్యామ్‌రావు, హరినాథ్‌రెడ్డి, సీహెచ్. మురళీకృష్ణ, ఎడ్ల నరేందర్ రెడ్డి, విజితా రెడ్డి, బి. కాంతారావు, విశ్వేశ్వర రావు, శ్రవణ్ కుమార్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

కళాకారులకు వినయం అవసరం

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జి.చంద్రకుమార్
- ఉగాది పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలు బాలలతో చంద్రకుమార్, రాము, ఎస్పీ భారతి, రేణుకా శ్రీనివాసులు

చిక్కడపల్లి: కళాకారులకు వినయం ఎంతో అవసరమని హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్ అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో నిర్వహించిన రసమయి బాలల ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ కళలపై శ్రద్ధ వహిస్తే గుర్తింపు అదే వస్తుందని అన్నారు. ఈర్ష్య ద్వేషాలతో మనశ్శాంతిని కోల్పోతామన్నారు. ఈ సందర్భంగా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, వీణ, ఛాయగ్రణం సృజనాత్మక కళల్లో ప్రతిభావంతులైన బాలలకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు రసమయి రాము అధ్యక్షత వహించిన సభలో కూచిపూడి నాట్యగురువు ఎస్పీ భారతి, రేణుక శ్రీనివాసులు, ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత మొలుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలు బీజేపీవే


మాజీ కార్పొరేటర్ రవీందర్

కవాడిగూడ: లోక్‌సభ పోలింగ్ సరళి చూస్తే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ అధిక సీట్లు కైవసం చేసుకోవడంతో పాటు సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి మరోసారి గెలుపొందడం ఖాయామని దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. ఎస్‌బీహెచ్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలు, బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే


కేశబోయిన శ్రీధర్

కాచిగూడ: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ధీమా వ్యక్తం చేశారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సికింద్రాబాద్ ఎంపీగా మళ్లీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా గెలుపొందుతారని పేర్కొన్నారు.

క్వీనీ విక్టోరియాకు సత్కారం


క్వీనీ విక్టోరియాను సత్కరిస్తున్న డాక్టర్ ప్రభు కిరణ్, రాజాజీ ప్రసాద్

కాచిగూడ: అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ కాచిగూడకు చెందిన గంధం క్వీనీ విక్టోరియాకు డేస్ స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ నుంచి స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్ లభించింది. సువార్త శాంతి ప్రార్థన సంస్థ చైర్మన్ డాక్టర్ ప్రభుకిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆమెకు డాక్టరేట్ అందించి సత్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ రాజాజీ ప్రసాద్, జీపీపీ మహిళా అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

తండా వాసుల అభివృద్ధికి కృషి


అరవింద్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న తండావాసులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తండా వాసుల అభివృద్ధికి కృషి చేస్తానని గ్రేటర్ కాంగ్రెస్ యువజన నాయకుడు అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో గుడి తండాలో నిర్మించనున్న ఆలయానికి మంగళవారం రూ. లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా తండా వాసులంతా ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌నాయక్, ముషీరాబాద్ బీ–బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, శేఖర్‌రెడ్డి, బాలునాయక్, దావునానాయక్, రాము నాయక్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్ విజయం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ విజయం ఖాయమని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహ ధీమా వ్యక్తం చేశారు. అడిక్‌మెట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో దానికి ఏమాత్రం తగ్గకుండా పద్మారావుగౌడ్‌కు ఓట్లు పోల్ అయ్యాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని కొనియాడారు. సమావేశంలో సీనియర్ నాయకులు సుధాకర్‌గుప్తా, కడప సురేందర్, వల్లాల శ్రీనివాస్, రవియాదవ్, దీన్‌దయాల్‌రెడ్డి, నేత శ్రీనివాస్, ఆకారం శ్రీనివాస్, గోపి, మహ్మద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల నటి శివ పార్వతి


శివ పార్వతికి పురస్కారం అందజేస్తున్న వంశీ రామరాజు, సంజీవి, రామ్‌కుమార్, త్రినాథరావు

చిక్కడపల్లి: భిన్న పాత్రల్లో నటించగల నటి శివ పార్వతి అని ప్రముఖులు కొనియాడారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో ప్రధాన వేదికలో మంగళవారం రాత్రి కళారవిందం సాంస్కృతిక వేదిక తృతీయ వార్షిక వేడుకల్లో శివ పార్వతికి మహా నటి సావిత్రీ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ శివ పార్వతి నేత్రాలతో సావిత్రీ వల్లే భావాలు పలికించే శక్తి ఉన్న అరుదైన నటి అని అన్నారు. రచయిత సంజీవి మాట్లాడుతూ తాను కొన్ని పాత్రలు సృష్టించానని శివ పార్వతి మాత్రమే ఆ పాత్రలు చేయగలదని పేర్కొన్నారు. ఈ సంస్థ స్థాపకుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ మూడేళ్లలో 50 పైగా సంగీత ఇతర కార్యక్రమాలు నిర్వహించిందని ఇకపై కూడా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రదీప్‌చంద్ర, కె.రవి, నాగేంద్ర, మణిబాబు, త్రినాథరావు, రేణుక, అఖిల, జ్యోతి తదితరులు అలపించిన తెలుగు, హిందీ గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

బొట్టుబిళ్లలతో ‘జై శ్రీరామ్’



బొట్టుబిళ్లలతో రూపొందించిన అయోధ్య ప్రాజెక్ట్ ఆవిష్కరిస్తున్న రూపకర్తలు

రాముడిపై భక్తిని చాటుకున్న మహిళా కళాకారులు

పంజగుట్ట: రాముడిపై ఉన్న భక్తిని వినూత్నంగా చాటుకున్నారు ఆరుగురు మహిళలు. ప్రతీరోజు ఐదు గంటలు, మొత్తంగా 12 రోజులు ఎంతో నిష్టగా ఉంటూ 32,970 బొట్టు బిళ్లలతో 30/40 అట్టపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో జై శ్రీరామ్ అని రూపొందించారు. దీనికి అయోధ్య ప్రాజెక్ట్ అని పేరు పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అయోధ్య ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రూపొందించిన కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, ప్రతిభా ధల్, రజనీ మంచికంటి, కోమలి మాట్లాడుతూ.. ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ బ్యానర్‌పై దీన్ని రూపొందించినట్లు తెలిపారు. 16,314 నారింజ బొట్టు బిళ్లలు, 3,192 నీలం బొట్టుబిళ్లలు, 13,464 ఆకుపచ్చ బొట్టుబిళ్లలతో దీన్ని తయారు చేశామన్నారు. ఏప్రిల్ 19న ఏకాదశి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మాంసాహారం తినకుండా, ఎంతో పవిత్రంగా ఉంటూ రూపొందించామని తెలిపారు. డిసెంబర్‌లో తమ బృందం అయోధ్యకు వెళ్లి అయోధ్య మ్యూజియంలో దీన్ని ఉంచనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీలో ప్రతీరోజు 5 గంటలు కష్టపడి దీన్ని రూపొందించామని పేర్కొన్నారు.

జన సంఘ్ కార్యకర్తకు దత్తాత్రేయ ప్రశంసలు


జన సంఘ్ కార్యకర్త ఓంకార్‌ను అభినందించిన బండారు దత్తాత్రేయ

అబిడ్స్: వయస్సుకు సంబంధం లేకుండా వృద్ధాప్యంలో కూడా జన సంఘ్ కార్యకర్త ఓంకార్ (82) ఎన్నికల పోలింగ్ పెంచేందుకు ఎంతో కృషి చేసినందుకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయనను అభినందించారు. గౌలిగూడలో చిన్నప్పుడు తన వెంట ఉంటూ 82 ఏళ్ల వయసులో కూడా ఓంకార్ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు గౌలిగూడ పరిసరాల్లో ఇంటింటా తిరుగుతూ ఓటు వేయాలని ఎంతో కృషి చేశారని దత్తాత్రేయ అన్నారు. 60 ఏళ్లుగా సమాజంపై నిబద్ధతతో, తపనతో ప్రతి ఎన్నికల్లో ఓంకార్ ఓటర్లకు అవగాహన కల్పించడం, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓంకార్ లాంటి వ్యక్తిని సమాజం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అందరు ఓటు వేయాలని, ఓటు హక్కు ఎంతో విలువైందని ఓంకార్ నుంచి యువత కూడా ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు.

మీరాలంమండి అమ్మవారి తీర్థ ప్రసాదాల అందజేత



చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి కుమారుడైన రాజేష్ సరిత దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని కోరుతూ మీరాలంమండి తీర్థ ప్రసాదాలను దంపతులకు అందజేసినట్లు గాజుల అంజయ్య తెలిపారు.

పారా సైక్లింగ్ టీమ్ కోచ్‌గా దత్తాత్రేయ



చార్మినార్: ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు ఇటలీలో జరుగనున్న పారా వరల్డ్ కప్–2 పోటీల కోసం ఇండియన్ సైక్లింగ్ (పారా) టీమ్ కోచ్‌గా.. మేనేజర్‌గా తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా పాతబస్తీకి చెందిన కె.దత్తాత్రేయ నియమితులయ్యారు. రాబోయే పారా ఒలింపిక్ గేమ్స్–2024 కోసం భారత్ తరఫున టీం నాణ్యమైన ఆట ప్రదర్శనను అందించి దేశానికి కీర్తి ప్రతిష్టలు అందించనున్నామని ఆయన దీమా వ్యక్తం చేశారు.


రెండోసారి ఓటు వేసేందుకు వచ్చిన మహిళపై కేసు

సంతోష్‌నగర్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం రెండోసారి ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళపై సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.రఘువీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం యాకుత్‌పురా నియోజకవర్గం కళందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన 111/68 పోలింగ్ బూత్‌లో ఓ మహిళ తన ఓటు హక్కును వినియోగించుకుంది. అనంతరం రెండోసారి కూడా అదే మహిళ ఓటు వేయడానికి వచ్చింది. దీనిపై ప్రొసిడింగ్ అధికారి సయ్యద్ ఫాతిమా సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘రాష్ట్రంలో మాకే విజయావకాశాలు’

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో విజయం సాధించనున్నారని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అన్ని వర్గాల ఓటర్లకు మేలు జరుగుతోందని..అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు అధికంగా ఓట్లు వేసి గెలిపిస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీ ఓటర్లు తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేశారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దూద్‌బౌలి: నయాపూల్‌లోని నయాబ్ హోటల్ ఎదురుగా ఉన్న ఓయో లాడ్జింగ్ వద్ద మంగళవారం ఉదయం 10:30 గంటలకు 40–45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోస్టు మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపారు. బ్లాక్ కలర్ టీ-షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ వేసుకున్న ఇతను 5.2 అడుగుల ఎత్తు ఉంటాడని.. అతనికి సంబంధించిన వారెవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఆయన కోరారు.

అధికారులకు కృతజ్ఞతలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీ, వినయ్‌కుమార్

చిక్కడపల్లి: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు కార్పొరేటర్ ఎ.పావనీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆమె మాట్లాడారు. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన పార్టీ నేతలు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే దేశవ్యాప్తంగా బీజేపీ హవా సాగే సూచనలు కనిపిస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు.

‘అమ్మ చెక్కిన శిల్పం’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత జాలాదిరత్న సుధీర్ రచించిన ‘అమ్మ చెక్కిన శిల్పం’పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ..మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని రచయిత రాసిన ఈ పుస్తకాన్ని పాఠ్యాంశంలో పెట్టదగ్గ గ్రంథమని కొనియాడారు. మాతృమూర్తుల ఔనత్యాన్ని తెలిపే ఈ పుస్తకాన్ని ప్రతి విద్యార్థిచేత చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కథా రచయిత సీహెచ్. రాంబాబు, అనువాదకులు డాక్టర్ లక్ష్మణాచారులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: సుమారు 20 ఏళ్ల క్రితం తెలుగు భాషలో కల్పిత ఊహాజనిత కథలు తప్పా బౌద్ధం గురించి వాస్తవాలు అందుబాటులో లేవని, నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులోకి రావడం ఎంతో అభినందనీయమని విశ్రాంత ఐపీఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో లతారాజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బౌద్ధ సాహిత్యంపై 10 రచనలతో పాటు ఇతర 4 సామాజిక సాహిత్య సంపుటిల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సాహిత్య పుస్తకాలు ప్రచురణలోకి రావడానికి కె.కె.రాజ కృషిని అభినందించారు. ఈ సమావేశంలో ప్రముఖ సాయిత్య, రచయితలు మల్లేపల్లి లక్ష్మయ్య, జయరాజ్, ఈమణి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయరెడ్డి తదితరులు

మలక్‌పేటలో బైక్ రేసింగ్‌లు

- రెచ్చిపోతున్న పోకిరీలు
- హడలిపోతున్న పాదచారులు


మలక్‌పేట జాతీయ రహదారిపై బైక్ విన్యాసాలు చేస్తున్న యువకులు


బీ-బ్లాక్‌కు వెళ్లే దారిలో..

మలక్‌పేట: బైక్ రేసింగులు, బైక్ విన్యాసాలతో యువకులు రహదారులపై హోరెత్తిస్తున్నారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్బర్‌బాగ్ బీ–బ్లాక్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై బైక్ రేసింగులు నిత్యకృత్యమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే జాతీయ రహదారితో పాటు అంతర్గత రోడ్లపై బైక్ విన్యాసాలు చేస్తున్నారు. అస్మాన్‌ఘడ్ వాటర్ వర్క్స్ కార్యాలయం నుంచి బాలికల జూనియర్ కాలేజ్ వరకు, మూసారంబాగ్ మెట్రో పరిసరాలు, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై నంబర్ ప్లేట్ లేని బైక్‌లపై అధిక వేగంతో రయ్.. రయ్ మంటూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఇతర వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. పోకిరీల బెడద పెరిగిందని, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులంటున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టి బైక్ రేసింగ్‌లు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన జర్నలిస్టులు


జర్నలిస్టులతో భేటీ అయిన గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

సైదాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డిని మలక్‌పేట నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు కలుసుకున్నారు. మంగళవారం ఉదయం సలీంనగర్ కాలనీలోని నివాసంలో త్రిపుర గవర్నర్ జర్నలిస్టులతో భేటీ అయ్యారు. మలక్‌పేట నియోజకవర్గంతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్న ఆయన జర్నలిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్రిపురకు సంబంధించిన రాజకీయ, సాంస్కృతిక, పర్యాటక, చరిత్ర వంటి పలు అంశాలను జర్నలిస్టులు ఆయనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జర్నలిస్టులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు


రెడ్డి కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

అంబర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 51.65 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 2.70 లక్షల ఓటర్లు ఉండగా 236 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అయితే పోలింగ్ పూర్తి కాగానే ఈవీఎంలను నారాయణగూడ రెడ్డి మహిళా కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చగా జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బీసీ కులవృత్తుల కార్పొరేషన్ అవసరం

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులవృత్తులను కాపాడాలని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి కోరారు. క్రమంగా కులవృత్తులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారిని కాపాడటంతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వటానికి బీసీ కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గీత, నేత, కుమ్మరి, వడ్రంగి వంటి అనేక కులవృత్తుల వారు నేటికీ తమ జీవితాల్లో వెలుగు లేక ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని తెలిపారు. కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేయాలని కోరారు.

కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ దారిలోనే..

ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

పంజగుట్ట: గత పది సంవత్సరాల్లో జరిగిన బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను తెలుసుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అది కూడా అదే దారిలో పోతోందని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గత సంవత్సరం డిసెంబర్ నాటికి 2.67 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గుర్తించామన్నారు.

‘సైలెంట్‌గా మజ్లిస్ బోగస్ ఓట్లు’


కొడి మహేందర్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన పోలింగ్‌లో మజ్లిస్ పార్టీ సైలెంట్‌గా బోగస్ ఓట్లకు తెర తీశారని.. సంబంధిత అధికారులు వారికే వత్తాసు పలకడంతో చివరి నిమిషాల్లో పోలింగ్ శాతం పెరిగిందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడి మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కళ్ల ముందే రియాసత్‌నగర్‌లోని పోలింగ్‌స్టేషన్ 40లో సమయం మించిపోయినప్పటికీ గేట్లు మూసి వేసి సైలెంట్‌గా మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేసిందన్నారు. మజ్లిస్ పార్టీ నాయకులు బోగస్ ఓట్లు వేయడంలో సిద్ధహస్తులని.. ఈసారి సైలెంట్‌గా వారి పని చేసుకున్నారన్నారు. వేలాది ఓట్లను తొలగించిన సంబంధిత అధికారులు సకాలంలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేయని కారణంగా పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో ఉన్న ఒక వర్గం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారన్నారు. ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు, కింది స్థాయి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.